

రూ.54.75 లక్షల విలువైన డ్రగ్స్ సీజ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లెపల్లి గ్రామంలోని ప్రాసెఫ్ బయోలాజికల్స్ పరిశ్రమపై గురువారం రాత్రి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ)అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా చిన్నపిల్లలకు సంబంధించి బాసిల్లస్ క్లాసి ఓరల్ సస్పెన్షన్ లిక్విడ్ డ్రగ్‌ను డ్రగ్ లైసెన్స్ అనుమతితో కాకుండా ఫుడ్ లైసెన్స్ అనుమతితో తయారు చేయడాన్ని గుర్తించారు. ఈ మేరకు రూ.54.75 లక్షల విలువైన డ్రగ్ స్టాక్‌ను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాము, సంగారెడ్డి, బొల్లారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు రవికిరణ్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

జహీరాబాద్ సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్

గజ్వేల్/జహీరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ హాఫీజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో గజ్వేల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో మార్కెట్ విలువను ఎక్కువ చేసి, ప్రభుత్వానికి నష్టం చేకూర్చారన్న ఆరోపణల నేపథ్యంలో చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ఓ రైతుకు చెందిన ఆరు సర్వే నంబర్లలోని భూమి నుంచి కాళేశ్వరం కాలువ వెళ్లడంతో అందుకు సంబంధించి మార్కెట్ విలువ తక్కువగా ఉంటే, ఎక్కువ చేసి ఇచ్చారని, తద్వారా నష్టపరిహారం అధికంగా అందిందని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ప్రస్తుతం జహీరాబాద్‌లో పనిచేస్తున్న హాఫీజ్‌ను సస్పెండ్ చేసింది. సదరు సర్వే నంబర్లలో ఓ నంబర్‌కు రూ.3లక్షల మార్కెట్ విలువ ఉంటే మరో సర్వే నంబర్లో భూమికి రూ.18 లక్షల విలువ ఉంది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ రూ.18లక్షలకు మార్కెట్ విలువను చూపెట్టడంతోనే రూ.3లక్షల విలువ ఉన్న భూమికి సైతం రూ.18లక్షల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించింది. విచారణ అనంతరం రైతుతో కుమ్మక్కై ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని గుర్తించారు. అయితే, ఈ లోపం సాఫ్ట్‌వేర్‌దేనని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.



సంగారెడ్డి జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు

కేటగిరీ	కనెక్షన్లు
గృహాలు	6,14,652
వ్యవసాయం	1,06,061
వాణిజ్యం	76,938
పరిశ్రమలు	5,504
ఇతరత్రా	17,427
మొత్తం	8,20,582



సంగారెడ్డి ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం

కోతలు లేని కరెంట్

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు

డిమాండ్‌ను తట్టుకునేలా కార్యాచరణ

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

సంగారెడ్డి జిల్లాలో రూ. 97 కోట్లతో పనులు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఎండలు మండుతున్నాయి. వ్యవసాయంతో పాటు గృహ విద్యుత్ వినియోగం వేసవిలో ఒక్కసారిగా పెరగనున్నది. డిమాండ్‌ను తట్టుకునేలా విద్యుత్ శాఖ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. వేసవిలో ఆటంకాలు, కోతలు లేకుండా కరెంటు సరఫరా చేయాలన్న లక్ష్యంతో కార్యాచరణను రూపొందించింది.

కొత్తగా 10 సబ్‌స్టేషన్లు.. త్వరలో అందుబాటులోకి

వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లాకు రూ.97 కోట్లను కేటాయించగా పనులు కొనసాగుతున్నాయి. జిల్లాలో కొత్తగా 10 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు కోసం రూ.35 కోట్లు ఖర్చవుతామని అంచనా వేశారు. 33కేవీ లైన్లు పదకొండు, 7 లెవన్ (పదకొండు) కేవీ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. వీటికి రూ.27 కోట్లుకేటాయించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 32 మంజూరు చేశారు. రూ.25 కోట్లతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు సరపడా లేకపోవడంతో ఎదరవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు కొత్తగా 350 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని నిర్ణయించారు. వీటి కోసం రూ.10 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

మరింత పెరగనున్న విద్యుత్ వినియోగం

సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం రోజుకు 15 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతుంది. ఎండలు ముదిరేకొద్ది మరింత పెరిగే అవకాశం ఉంది. నిత్యం 17 మిలియన్ యూనిట్ల వరకు వినియోగం పెరగవచ్చని ఆ శాఖ అధికారులు అంచనా వేశారు. వినియోగం ఎంత పెరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రణాళికలు అమలయ్యేలా జిల్లాకు ప్రత్యేకంగా డైరెక్టర్ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించారు.

ఐఐటీహెచ్‌లో ఎలాన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్



ఐఐటీ హైదరాబాద్‌లో రోబోసాకర్ ఆడుతున్న విద్యార్థులు

కంది, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. శని, ఆదివారాల్లో దేశ నలుమూలల నుంచి విద్యార్థులు రానున్నారు. ఈ ఏడాది ఫెస్ట్‌కు 50 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నృత్యాంజలి, క్లాసికల్ పెర్ఫార్మెన్స్, మెకానికల్ బుల్, మూవీ స్క్రీనింగ్, హమ్మర్, ఉడెన్ గేమ్స్, హ్యూమన్ టిక్‌టాక్ టాయ్, ట్విస్టర్, మిస్టరీ రూమ్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసారి పోటీల్లో గెలిచిన వారికి రూ.6 లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నట్లు ఐఐటీహెచ్ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అని వసతులను సరిచూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు తరలించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఝరాసంఘంలోని కేతకి సంగమేశ్వర స్వామి జాతరకు అన్నిరకాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. అనంతరం ఇటుకల తయారీ, ఇళ్ల నిర్మాణ శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. న్యాక్ ఆధ్వర్యంలో ఆయా విభాగాల్లో శిక్షణకు జిల్లాలో 118 మంది మహిళలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు.

వనదుర్గమ్మపై చిన్నచూపు

26 నుంచే ఏడుపాయల జాతర

ఇప్పటివరకు పైసా విదల్చని ప్రభుత్వం

మొక్కుబడి సమావేశాలతోనే సరి

పాపన్నపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గమాత మహాజాతరను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉపవాస దీక్షలతో ప్రారంభమయ్యే జాతర, బండ్ల ఊరేగింపు, రథోత్సవం తదితర కార్యక్రమాలతో వారం రోజుల పాటు కొనసాగనున్నది. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. జాతర ఏర్పాట్ల కోసం ప్రతీ ఏటా ప్రభుత్వం రూ.కోటి విడుదల చేసేది. కానీ ఈసారి పైసా విదల్చలేదు.



ఆలయానికి కొంతమేరకు విద్యుత్‌దీపాలతో అలంకరణ

కనీసం ఉత్సవ కమిటీ లేదు..

జాతరకు నెల రోజుల ముందే స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కలెక్టర్‌తో పాటు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులతో ఏడుపాయలో సమీక్షా సమావేశం నిర్వహించేవారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేసేవారు. ఈసారి సమావేశాన్ని మొక్కుబడిగా ముగించారు. గతంలో పాలకమండలి, అధికారులు సమన్వయంతో జాతరకు ఏర్పాట్లు చేసేవారు. ఈసారి పాలకమండలిని ఏర్పాటు చేయలేదు. కనీసం ఉత్సవ కమిటీని నియమించలేదు. దీంతో జాతరకు లక్షల్లో తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించే బాధ్యత అధికారులకు భారమే కానుంది.

వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి

- మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

మెదక్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సంవత్సరం ముగింపులోగా మెదక్ మున్సిపల్ పరిధిలో పన్ను వసూళ్లను వందశాతం పూర్తి చేయాలని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పన్ను వసూళ్లపై సిబ్బందికి మార్గదర్శనం చేశారు. సంవత్సరంలో తొమ్మిది నెలలు ఒక ఎత్తైతే డిసెంబరు నుంచి మార్చి నెలాఖరు వరకు మరో ఎత్తని వివరించారు. ఈ ఏడాది ఆస్తిపన్ను రూ.5.41 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.3 కోట్లు మాత్రమే వసూలయ్యాయని తెలిపారు. మిగతా పన్ను రాబట్టడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాల్సిందిగా ఆర్‌ఐ జానయ్యను ఆదేశించారు. మొండిబకాయిలను సైతం వదలొద్దని సూచించారు. ప్రతీ నెలా మున్సిపల్ సిబ్బంది జీత భత్యాల నిమిత్తం రూ.40 లక్షలు వెచ్చించాల్సి వస్తున్నందున బకాయిదారులకు పరిస్థితి వివరించి పన్ను రాబట్టాలని ఆదేశించారు. నిత్యం ఆటోలు, పారిశుధ్య వాహనాలకు మైకులు బిగించి ప్రచారం చేయడం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు.

వైద్య సేవలు విస్తృత పరచాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్య సేవలు విస్తృత పరచాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆయన శుక్రవారం మెదక్‌లోని డ్రగ్‌స్టోర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెదక్ ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు నిల్వ ఉంచుకోవాలని, జిల్లా డ్రగ్‌స్టోర్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాలకు మందులు సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో వందశాతం ఇమ్యునైజేషన్ సేవాలందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి శ్రీరాం, డీసీహెచ్‌వో శివదయాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్ రెడ్డి తదితరులున్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్

రోగికి భరోసా కల్పించిన కలెక్టర్

మెదక్ ఆస్పత్రిలోని ఓ రోగిని హైదరాబాద్ రెఫర్ చేయడాన్ని గమనించి రోగి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రెఫర్ చేయడానికి కారణం ఏమిటి అని డ్యూటీ డాక్టర్‌ని ప్రశ్నించగా రోగి పల్స్‌రేట్ తక్కువగా ఉందని, ఛాతి సంబంధిత వ్యాధి ఉండడంతో మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తున్నామని తెలిపారు. దీంతో రోగి, వారి బంధువులకు ఏ అవసరమున్నా తన నంబరుకు కాల్ చేయండని భరోసా కలిపించారు.



రయ్.. రయ్

నర్సాపూర్‌లో ఈ వాహనాల హంగామా

బీవీఆర్ఐటీ వేదికగా జాతీయస్థాయి పోటీలు

23న ప్రత్యేక ట్రాక్‌పై దూసుకెళ్లనున్న ఎలక్ట్రిక్ వాహనాలు

వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 77 జట్లు

7



అమీన్‌పూర్‌లో ఆక్రమణలపై కొరడా

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలపై రెవెన్యూ శాఖ కొరఢా ఝుళిపించింది. సర్వే నంబర్ 993, 994లోని భూముల్లోని సుమారు 25 రేకులషెడ్డులను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయించింది.

- అమీన్‌పూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి)



మహిమాన్వితం ఉమామహేశ్వరాలయం

మహిమాన్వితం ఉమామహేశ్వరాలయ నిర్మాణమని మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జానారెడ్డి అన్నారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆశ్రమాన్ని మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జానారెడ్డి శుక్రవారం సందర్శించారు. మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆలయ విశేషాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ మహిమాన్వితం ఉమామహేశ్వరాలయ నిర్మాణమని అన్నారు.

- సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి)

ప్రజలకు అండగా కాంగ్రెస్ సర్కార్

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్ అన్నివర్గాలకు అండగా నిలుస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన స్వగృహంలో మోకు దెబ్బ గౌడ జనహక్కుల పోరాట సమితి-2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అలాగే పోస్టాఫీస్‌ను ఐవోసీలోని మొదటి ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు తరలించేందుకు కృషి చేసిన నర్సారెడ్డిని పోస్టాఫీస్ సిబ్బంది శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

ధూళిమిట్ట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, షీటీమ్ సభ్యులు విద్యార్థులకు మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఏఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలిసి తెలియని వయస్సులో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. తాత్కాలిక ఆనందాల కోసం జీవితకాల సంతోషాలను దూరం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రం, ఉపాధ్యాయులు, షీటీమ్ సభ్యులు సదయ్య, ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల : ఐనాపూర్ జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

చిన్నకోడూరు/తొగుట/చేర్యాల ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం విఠలాపూర్ ప్రాథమిక పాఠశాల, తొగుట మండలం గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొమురవెల్లి మండలం అయినాపూర్ జడ్పీఎస్ఎస్‌లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేసి, అభినందించారు.


తొగుట : గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



కుకునూరుపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియామకమైన బైరీ శంకర్ ముదిరాజును కుకునూరుపల్లి మండల ఆ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కోరే సంతోష్, రెడ్డమైన లింగం, మందరాజు, గాండ్ల భాను తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి : డీబీఎఫ్


డిప్యూటీ తహసిల్దారుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గజ్వేల్ డిప్యూటీ తహసిల్దార్ భార్గవ్‌కు డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణుతో కలసి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో కేవలం 7శాతం నిధులు మాత్రమే కేటాయించారని, రానున్న బడ్జెట్‌లోనైనా 15శాతం కేటాయించి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో అమర శ్రీనివాస్ జ్ఞాపకార్థం అతని సోదరుడు అమర రాము ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నేతలు బంగ్లా శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, అజీజ్, పాషా, హరి, ప్రసన్నారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



క్రైం కార్నర్

పాముకాటుతో మహిళ మృతి


మంజ లక్ష్మి (ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన మంజ లక్ష్మి (55) శుక్రవారం మృతి చెందింది. ఇంట్లో మధ్యాహ్నం నిద్రిస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. కేకలు వేయడంతో చుటుపక్కలవారు గమనించి చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇరువురు కుమారులు, కూతురుఉన్నారు.

పాదచారిని ఢీ కొన్న బైక్.. నలుగురికి గాయాలు

రామాయంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట రైల్వేస్టేషన్ రహదారిపై జరిగిన ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు శుక్రవారం బైక్‌పై వెళ్తూ ఎదురుగా పాదచారిని ఢీ కొట్టి కింద పడిపోయారు. దీంతో నలుగురికీ గాయాలు అయ్యాయి. వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


ఇసుక డంపు వద్ద నిందితుడితో పోలీసులు

అక్రమ ఇసుక డంప్ స్వాధీనం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మంగోల్ శివారులో హైదరాబాద్‌కు చెందిన చిరుకూరి నాగేశ్వరరావు 200 టన్నుల ఇసుక డంప్ చేశారన్న సమాచారంతో దాడులు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు.


బోల్తాపడిన వాహనం

అదుపుతప్పి బొలెరో వాహనం బోల్తా

● ఒకరి మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి బొలెరో వాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కర్ణాటకకు చెందిన కార్మికులు ఏపీ 25 ఎక్స్ 743 నంబర్ గల బొలెరో వాహనంలో రోడ్డుకు ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. వాహనం శీర్యవాగు వద్దకు రాగా, అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న కార్మికుడు అమ్రేష్(28) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాష్ ఆయిల్ పట్టివేత

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హాష్ అయిల్ రవాణా చేస్తుండగా, రామచంద్రపురం పోలీసులు పట్టుకున్నారు. సీఐ జగన్నాథ్ కథనం ప్రకారం.. ఒడిషా రాష్ట్రానికి చెందిన చంద్రశేఖర్ వైజాగ్‌లో మూడు కిలోల హాష్ ఆయిల్‌ను పుణేకు చెందిన గౌరవ్‌కు విక్రయించాడు. అతను వైజాగ్ నుంచి పుణేకు బస్సులో వెళ్తుండగా, లింగంపల్లి కూడలి వద్ద శుక్రవారం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

అత్యాచారం కేసులో
నిందితుడి రిమాండ్


నిందితుడు మహ్మద్ ఖలీమ్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కలకలం రేపిన బాలిక అత్యాచారం కేసులో నిందితుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో గురువారం రాత్రి బాలిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సదాశివపేట పట్టణానికి చెందిన మహ్మద్ ఖలీమ్ అలియాస్ నావేద్(24) అదే రోజు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవీందర్ చెప్పారు. ఈ కేసులో నిందితుడు మహ్మద్ ఖలీమ్ అలియాస్ నావేద్ (24)ను పాత నేరస్థుడిగా పోలీసులు గుర్తించారు. గతంలో పలు దొంగతనాలు, ఒక రేప్ కేసులో నిందితుడుగా ఉన్నాడు. సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో, బోరబండ, బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్‌లలో పరిధిలో నిందితుడు ఖలీమ్‌పై నాలుగు కేసులు ఉన్నాయి. ఆ కేసుల్లో జైలుకు వెళ్లి బయటకు వచ్చాడు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూంలలో అతని అక్కాబావ వద్ద కొన్ని రోజులుగా ఉంటున్నాడు.


108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి వెళ్తున్న తండ్రీకొడుకులు

గాయాలతో ఆస్పత్రికి వస్తే పట్టించుకోలె..

కొల్చారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తీవ్ర గాయాలతో ఆస్పత్రికి వచ్చిన ఓ బాధితుడిని ఎవరూ పట్టించుకోలేదని ఆరోపణలు వచ్చాయి. మండలంలోని సంగాయిపేటకు చెందిన బద్రి మల్లేశం, అతని తండ్రి వెంకటేశం రంగంపేటకు కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చారు. మల్లేష్‌కు మూర్ఛ వచ్చి కిందపడటంతో ముఖానికి తీవ్ర గాయాలు అయ్యాయి. అక్కడున్న వారు ఆటోలో రంగంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి సిబ్బంది ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి బయటే నిలబడాల్సి వచ్చింది. అయితే, ఆస్పత్రి సిబ్బందే 108కు ఫోన్ చేస్తే అరగంట తర్వాత వచ్చింది. గాయపడిన మల్లేష్‌ను అందులో మెదక్ ఆస్పత్రికి తరలించారు. అయితే, ముఖానికి తీవ్ర గాయాలై రక్తం కారుతున్నా.. వైద్య సిబ్బంది పట్టించుకోలేదని.. అధికారులు స్పందించి ఆస్పత్రిలో ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రయ్.. రయ్

నర్సాపూర్‌లో ఈ-వాహనాల హంగామా

- బీవీఆర్ఐటీ వేదికగా జాతీయస్థాయి పోటీలు
- 23న ప్రత్యేక ట్రాక్‌పై దూసుకెళ్లనున్న ఎలక్ట్రిక్ వాహనాలు
- వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 77 జట్లు
- ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి
- ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీల్లో ప్లేస్‌మెంటుకు అవకాశం


విద్యార్థులు తయారు చేసిన వాహనాలను పరీక్షిస్తున్న ప్రతినిధులు



నర్సాపూర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కొంత దూరం బురద.. మరికొంత దూరం గుంతలు.. ఇంకొత దూరం ఎత్తైన ప్రాంతం.. ఆ తర్వాత రాళ్లరప్పలు.. అనంతరం నీళ్ల ఇలా అన్ని రకాలుగా ప్రత్యేకంగా తయారు చేయించిన 3.8 కిలోమీటర్ల ట్రాక్‌పై దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు ఎలక్ట్రిక్ వాహనాలతో రయ్.. రయ్‌మని రేసులో పాల్గొనను న్నాయి. ఈ-బాజా సే ఇండి యా-2025 పేరిట మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాల కార్ రేస్ కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ జాతీయ స్థాయి పోటీలను ఈవెంట్ సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ ఇండియా, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో బీవీఆర్ఐటీ కళాశాల నిర్వహిస్తున్నది. 25 వరకు కార్యక్రమం కొనసాగనున్నది. ఈ జాతీయ స్థాయి పోటీలకు రెండోసారి బీవీఆర్ఐటీ కళాశాల వేదికైంది. దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా రాష్ట్రంలో బీవీఆర్ ఐటీ కళాశాల ఈ పోటీలకు వేదికగా నిలిచింది. గతేడాది నిర్వహించిన తీరుకు మెచ్చి రెండోసారి అవకాశం దక్కగా పోటీలు ప్రారంభమయ్యాయి.

ఒక్కో జట్టులో 30 మంది విద్యార్థులు

ఈ పోటీల్లో దేశంలోని ఆయా రాష్ట్రాల నుంచి 77 జట్లు పాల్గొంటున్నాయి. తెలంగాణ నుంచి-2, ఆంధ్రప్రదేశ్-2, అత్యధికంగా మహారాష్ట్ర-23, తమిళనాడు-17 జట్లు పాల్గొంటున్నాయి. ఒక్కో టీంలో 25 నుంచి 30 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లే వాహనాలను సొంతంగా తయారు చేసి వాటి పనితీరు, వాటి సామర్థ్యంతో పాటు సాంకేతిక అంశాలను వివరించి ప్రదర్శించాలి. శుక్రవారం విద్యార్థులు తయా రు చేసిన వాహనాలను పరిశీలించి సాంకేతిక అంశాలను పరిశీలించారు. బ్రేక్ టెస్టు, రేయిన్ స్టోమ్ టెస్టు, డిజైన్, ఇన్నోవేషన్, వాలిడేషన్, అక్సిలరేషన్ తదితర వాటిని సాంకేతిక నిపుణులు పరీక్షించారు. అయితే ఈ వాహనాల తయా రు చేయడానికి విద్యార్థులకు ఆయా కాలేజీల సహకారంతో పాటు పలు సంస్థలు, పరిశ్రమలు ఆర్థిక సహాయం అందించాయి. విద్యార్థులు రూపొందించిన ఒక్కో ఎలక్ట్రిక్ వాహన ఖర్చు రూ.4 నుంచి 11 లక్షల వరకు ఉంది.


ప్రాథమిక పరీక్షలో నెగ్గిన పుణె బృందం

ఇంధనానికి ప్రత్యామ్నాయంగా..

దేశంలో పెట్రోలు, డీజిల్ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా నూతన సాంకేతికతతో ఎలక్ట్రికల్ వాహనాల తయారీ, విద్యార్థుల ప్రతిభను వెలికితీసి ప్రాక్టికల్ నాలెడ్జిని బయటపెట్టి కొత్తకొత్త ప్రయోగాల ద్వారా దేశానికి ఉపయోగపడేలా వాహనాలను రూపొందించడమే ఈ- బాజా సే ఇండియా ధ్యేయం. విద్యార్థులు తయారు చేసిన వాహనాలకు అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వా త వాటి ఆమోదం అయ్యాక 23వ తేదీన నర్సాపూర్ సమీపంలోని చెరువు ప్రాంగణంలో ప్రత్యేకంగా వేసిన ట్రాక్‌పై నాలుగు గంటల పాటు పోటీ పడతాయి. తాము రూపొందించిన కారుతో ఈ ట్రాక్‌ను విజయవంతంగా పూర్తిచేసిన జట్టు విజేతగా నిలుస్తుంది. వారి కి భారత ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతిని అందజేస్తుంది. ఈ పోటీలు పూర్తయ్యాక ప్రముఖ ఆటోమొబైల్ పరిశ్రమలు 24, 25తేదీలలో ఇక్కడే ప్లేస్‌మెంటు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కూడా కల్పిస్తారు. ఇంత కఠినమైన పోటీల్లో విద్యార్థినులు సైతం పాల్గొనడం విశేషం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బీమవరానికి చెందిన విష్ణు మహిళ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన 25 మంది విద్యార్థినులు ప్రత్యేకంగా నిలుస్తున్నారు. మిగ తా టీంలలో పురుషులు, స్త్రీలు ఇద్దరు కలిసి ఉండగా ఈ టీంలో మాత్రం మొత్తం మహిళలే ఉన్నారు.


బీవీఆర్ఐటీ కాలేజీ బృందం

కఠినమైనా సత్తా చాటాలని వచ్చాం



ఈ పోటీలు ఎంతో కఠినమైనవి అయినా మేము పురుషులతో సమానంగా సత్తా చాటాలనే ఉద్దేశంతో వచ్చాం. మా బృందంలో మొత్తం 25 మంది విద్యార్థినులం ఉన్నాం. మేమే సొంతగా వాహనం తయారు చేయడంతో పాటు ట్రాక్‌పై డ్రైవింగ్ కూడా మహిళనే చేస్తుంది. వాహనానికి రూ.4.5 లక్షల వరకు ఖర్చయింది. మా కాలేజీ యాజమాన్యంతో పాటు కొన్ని సంస్థలు ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించాయి.

- సురేఖ, బీమవరం మహిళా ఇంజనీరింగ్ కాలేజీ టీం కెప్టెన్

పోటీలతో ప్రతిభ వెలుగులోకి..



దేశస్థాయిలో నిర్వహించే పోటీలను బీవీఆర్ఐటీలో నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ పోటీలలో పాల్గొని సత్తా చాటే అవకాశం రావడం గ్రేట్‌గా ఫీల్ అవుతున్నాం. పుస్తకాలలో చదివిన చదువుకు పదును పెట్టి కొత్తకొత్త ఆలోచనలతో మేము తయారు చేసిన వాహనం ప్రదర్శించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. మా వాహనానికి రూ.11 లక్షలు ఖర్చు అయింది.

- శివ, బీవీఆర్ఐటీ కాలేజీ బృందం కెప్టెన్


మహిళాశక్తి క్యాంటీన్ నిర్వాహకులతో బిహార్ అధికారుల బృందం

మెప్మా పథకాలు భేష్..

● మున్సిపాలిటీని సందర్శించి బిహార్ బృందం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో అమలవుతున్న మెప్మా పథకాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతాయని బీహార్ రాష్ట్ర అధికారులు కితాబునిచ్చారు. ఆ రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి చేరుకున్న వారు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలుసుకున్నారు. స్థానికంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు అమలవుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో మహిళలు నడుపుతున్న స్టీల్‌బ్యాంక్, టైలరింగ్ సెంటర్, స్త్రీ శక్తి క్యాంటీన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ రాష్ట్రంలో సైతం మహిళల కోసం పథకాలు అమలు చేస్తున్నామని, కానీ ఇక్కడ మాత్రం ప్రవేశపెట్టిన పథకాలు వారు ఆర్థికంగా ఎదిగిందుకు కృషి చేస్తున్నట్లు గమనించామన్నారు. రుణాలతో పాటు బ్యాంకు లింకేజీల కోసం అధికారులు సహకరిస్తున్నట్లు తెలుసుకున్నట్లు చెప్పారు. ఇక్కడ విజయవంతంగా పథకాలు కొనసాగుతున్నాయని కితాబునిచ్చారు. బృందంలో బీహార్ రాష్ట్ర కమిటీ ఫైనాన్సియర్ సంజయ్‌మిశ్రా, రితీష్‌కుమార్, విద్‌ప్రకాష్, దీపక్ కుమార్, కునాల్, స్థానిక మెప్మా అధికారులు ఉన్నారు.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు

● ఉమ్మడి జిల్లాలో 180 మంది డ్రైవర్ల కొరత

● ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత



జహీరాబాద్, ఫిబ్రవరి 21: ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు ఈ నెల 18 నుంచి శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ప్రయాణికులతో ఆర్టీసీ సిబ్బంది నడుచుకునే విధానం, ఆదాయ మార్గాలను పెంచుకోవడం, ప్రమాదాల నివారణ, డీజిల్ ఆదా, టీం వర్క్, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పని చేయడం వంటి అంశాలపై శిక్షణ, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నామన్నారు. త్వరలో ఏడుపాయల, ఝరాసంగంలో జాతరలు ఉన్నందున ఆయా డిపోల నుంచి 132 బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి అదనపు బస్సులు నడుపుతామన్నారు. ఉమ్మడి జిల్లాలో 180 మంది డ్రైవర్ల కొరత ఉందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తూప్రాన్ ఆసుపత్రి తనిఖీ చేస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

కోడ్ ముగియగానే ఖాళీల భర్తీ

● వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

తూప్రాన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆసుపత్రిల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేసేందుకు ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జే. అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆసుపత్రిల్లో మెటర్నటీ సేవలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తూప్రాన్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం సేవలు రోగులకు అత్యవసర సేవలు అందజేయాలని సూచించారు. తూప్రాన్ బ్లడ్ బ్యాంకు సేవలు ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నిషియన్ సేవలు వినియోగించుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆస్పత్రిలో ఓపీ, ఇన్‌పేషెంట్ సేవలు, ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను ఉరి తీయాలి

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కే.ఏ.పాల్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఆరేళ్ల పాపను అత్యాచారం చేసిన నిందితులను ఉరితీయడమే సరైనదని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కే.ఏ.పాల్ అన్నారు. అత్యాచారానికి గురైన సంగారెడ్డిలోని సఖీ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాలికను శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడే వారిని దేశంలో కఠినంగా శిక్షించే చట్టాలు లేవని, అందువల్లే అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అత్యాచారాలు, భౌతిక దాడులు ఎక్కువయ్యాయని విమర్శించారు. అత్యాచారం చేసిన నిందితులు పారిపోకుండా పోలీసులు వెంటనే స్పందించి అరెస్టు చేసినందుకు వారిని అభినందిస్తున్నానని కేఏ పాల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రూ.1.60 కోట్ల విలువైన పెండింగ్ బిల్లులు..
సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్

● విద్యుత్ ఎస్ఈ అచ్చంపేట శంకర్

తూప్రాన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను వినియోగదారులు వెంటనే చెల్లించాలని విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ అచ్చంపేట శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం తూప్రాన్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డీఈ గరత్‌మంత్‌రాజ్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2500 గృహ, గృహేతర విద్యుత్ వినియోగదారుల కరెంటు బిల్లులు రూ. 1.60 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని నిరంతర విద్యుత్ సరఫరా కోసం డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేస్తున్నామని, 24 గంటలు సేవలు అందజేసేందుకు ముగ్గురు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వినియోగదారులకు ఏదైనా సమస్య ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో డేటా యాక్సిలరేషన్ సెంటర్

● మార్వెల్ సంస్థతో కలిసి ప్రారంభం

కంది, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ స్టోరేజ్ సెక్యూరిటీ టెక్నాలజీల పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శుక్రవారం డేటాలో అగ్రగామి అయిన మార్వెల్ టెక్నాలజీ సంస్థ ప్రపంచంలోనే మొదటి డేటా యాక్సిలరేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. ఐఐటీహెచ్‌లోని కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధకులతో కలిసి మార్వెల్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ క్యారీ ఉస్సేరీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఐఐటీహెచ్, మార్వెల్ సంస్థలు ఉమ్మడి కోర్సులు, హ్యాండ్సన్ శిక్షణ సౌకర్యం, పరిశోధనలు చేయనున్నాయి. ప్రపంచాన్ని కనెక్ట్ చేసే డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీని అందించడానికి మార్వెల్ సంస్థ సహకారంతో ముందుకు సాగుతామని ఐఐటీహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ తమ్మన తెలిపారు.

మాకొద్దీ డంప్ యార్డ్

● 17వ రోజు ధర్నా, రాస్తారోకో

గుమ్మడిదల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డంపు యార్డ్ మాకొద్దు... కంపుతో మేము ఉండలేమంటూ గుమ్మడిదల మండల ప్రజలు ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. శుక్రవారం 17వ రోజూ నిరసన చేపట్టారు. మెదక్- హైదరాబాద్ రోడ్డుపై మహిళలు, జేఏసీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నల్లవల్లి, గుమ్మడిదల గ్రామాలలో డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా రిలే నిరహర దీక్షలు కొనసాగించారు.


డంపుయార్డ్‌కు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

భూసర్వేను అడ్డుకున్న రైతులు

ప్యారానగర్ పరిధిలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్ కోసం చేపడుతున్న భూ సర్వేను రైతులు అడ్డుకున్నారు. డంపింగ్ యార్డ్‌కు కేటాయించిన స్థల పరిధిలో రైతుల వ్యవసాయ భూములు ఉన్నాయని, ఆ భూములను సర్వే చేసి హద్దులు చూపించే వరకు డంపిగ్ యార్డ్ పనులు ఆపాలని కొన్ని రోజుల క్రితం స్థానిక రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు తాత్కాలిక స్టే ఇచ్చి, రైతుల భూములను పూర్తిస్థాయిలో సర్వే చేసి వారి భూముల హద్దులను చూపించే వరకు డంపింగ్ యార్డ్ పనులు ఆపాలని, నిర్ణీత సమయంలో భూ సర్వే చేయాలని ఆదేశించింది. దీంతో శుక్రవారం జిల్లా సర్వే ఏడీ ఐలేష్ ఆధ్వర్యంలో స్థానిక మండల రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేపట్టేందుకు వచ్చారు. దీంతో సంబంధిత రైతులు, మండల జేఏసీ నాయకులు మద్దుల బాల్ రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, వేణుగోపాల్ అక్కడికి వచ్చారు. పూర్వం ఉన్న హద్దుల ప్రకారమే సర్వే చేయాలని రైతులు కోరగా, తాము కోర్టు ఉత్తర్వులు, నిబంధనల ప్రకారమే సర్వే చేస్తామని అధికారులు చెప్పారు. అసంతృప్తి చెందిన రైతులు ఈ సర్వే డంపింగ్ యార్డ్ నిర్మిస్తున్న సంస్థకు అనుకూలంగా ఉందని, ఈ సర్వేను తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమని బహిష్కరించి వెళ్లిపోయారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవానీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నోరు మెదపకపోవడం విచారకరం

● ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్ దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్యారానగర్ వద్ద ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డ్ వల్ల అటవీ ప్రాంతంతో పాటు గ్రామాలకు పెను ముప్పు ఉందని, డంపుయార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం మాట్లాడకపోవడం విచారకరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. డంప్‌యార్డ్ వద్దంటూ నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న దీక్షల వద్దకు శుక్రవారం ఆమె వచ్చి, ఐదవ రోజు కూర్చున్న రిటైర్డు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సాపూర్, గుమ్మడిదల ప్రాంతంలో కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను గుర్తించి ఈ ప్రాంత ప్రయోజనాలు కాపాడుతూ డంపుయార్డు నిర్మాణం నిలిపివేయాలని డిమాండు చేశారు. ప్రభుత్వం ఇలాగే మొండిగా ఉంటే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్‌తో పాటు రిటైర్డు ఉద్యోగులు గంగాధర్, విటల్, కిష్టయ్య, ధన్‌సింగ్, కృష్ణస్వామి, ముదిరాజ్ సంఘం నాయకులు కొండికుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- అసంపూర్తిగా అటవీశాఖ కార్యాలయాలు
- పట్టించుకోని అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల వేడుకోలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మెదక్ జిల్లా మండల కేంద్రమైన వెల్దుర్తిలో కొన్నేళ్ల క్రితం వరకు వాడుకలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ దవాఖానాలో ఉన్న డాక్టర్ క్వార్టర్, అటవీశాఖ కార్యాలయాల, ఐకేపీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. వెల్దుర్తిలో ఎస్సీ బాలుర వసతి గృహం బస్టాండ్‌కు సమీపంలో నిర్మించారు. 15 ఏళ్ల క్రితం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తూప్రాన్‌కు తరలించడంతో.. వెల్దుర్తిలోని భవనం అప్పటి నుంచి ఖాళీగా ఉన్నది. ఈ భవనంలో నాలుగు గదులు, కార్యాలయం, వంటశాల, భోజనశాల, వరండా, ప్రహరీలు ఉన్నాయి. అలాగే వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానాలో విధులు నిర్వర్తించే వైద్యులు స్థానికంగా ఉండేందుకు దవాఖానా ఆవరణలో క్వార్టర్ నిర్మించారు. 13 ఏళ్ల క్రితం వరకు డాక్టర్లు ఇక్కడే ఉండేవారు. ప్రసుత్తం వైద్యులు స్థానికంగా ఉండకపోవడంతో క్వార్టర్ నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలో రెండు గదులు, హాల్, వంటశాల శౌచాలయాలు, నీటి వసతులు ఉన్నాయి.



శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం, నిరుపయోగంగా డాక్టర్ క్వార్టర్

అటవీశాఖ కార్యాలయాల పరిస్థితి అంతే..

1996లో వెల్దుర్తిలోని సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో అటవీశాఖ డిప్యూటీ రేంజ్, బీట్ కార్యాలయాల నిర్మాణాలను ప్రారంభించి నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యంతో పనులు పూర్తిచేయకుండానే వదిలేశారు. ప్రస్తుతం వీటి చుట్టూ చెట్లు, పొదలు పెరిగి అధ్వానంగా మారాయి. నీటి వసతి, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పనులు చేపడితే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.

వినియోగం లేని పాత సమైఖ్య భవనం

వెల్దుర్తిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న పాత సమైఖ్య భవనంలో ఆరేళ్ల క్రితం వరకు ఐకేపీ కార్యాలయం నిర్వహించారు. కొత్త భవనం నిర్మించడంతో నూతన భవనంలోకి తరలించారు. దీంతో ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది. దీనికి తోడు భవనం తలుపులు, కిటికీలు శిథిలమై గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి వృధాగా ఉన్న భవనాలు వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు: ఎమ్మెల్యే



సన్మాన సభలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో మాజీ మున్సిపల్ పాలకవర్గం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇటీవల పదవీ విమరణ చేసిన మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శుక్రవారం పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా సన్మానించి మాట్లాడారు. ప్రజలు ఓట్లేసి గెలిపించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తివంచనలేకుండా పదవులకు న్యాయం చేయాలన్నారు. రాజకీయాలను సీరియస్‌గా తీసుకుని ఐదేళ్లలో సాధ్యమైనంతవరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ పుష్పానగేష్, మాజీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, తొంట అంజయ్యయాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమన్యాయం: భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర అన్నారు. మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శుక్రవారం పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ చేయదగ్గ పోలీసు, భార్యాభర్తల చిన్న చిన్న వివాదాలు, ఎక్సైజ్, బ్యాంకు, తదితర కేసులన్నీ ఇరువర్గాల వారితో రాజీ కుదుర్చాలన్నారు. ఈ సమావేశంలో న్యాయాధికారులు కే.జయంతి, పీ.కృష్ణార్జున్, జీ.సునీత, లావణ్య, ఎం.రాధాకృష్ణ చౌహాన్, జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి బీ.రమేష్, అనిత, ధనలక్ష్మి, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావుతో పాటు సీఐలు, ఎస్‌ఐలు న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవానీచంద్ర

మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి లక్ష్మీశారద పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జడ్జిలు రుబీనా ఫాతిమా, సిరి సౌజన్య, సాయి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ఓట్లు అడిగే హక్కు లేదు

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ఓట్లు అడిగే హక్కు లేదని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో వంచిస్తున్న కాంగ్రెస్

పుల్‌కల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి రాగానే ఆరుగ్యారంటీలు అమలు చేస్తామని హామీఇచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచనకు గురిచేసిందని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలకే దిక్కులేకుండా పోయిందని, కొత్త పథకాలను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చిన్నమైల్ అంజిరెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పట్టభద్రులను కోరారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

- ఆర్టీసీ డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖేడ్ నుంచి జహీరాబాద్‌కు వెళ్లే బస్సులు సమయపాలన పాటించేలా చూడాలని న్యాల్‌కల్ చెందిన ఆనంద్, ఉమారాణి, శైలజ ఫోన్ చేసి కోరారు. ఖేడ్ నుంచి నాగూర్.బికు ఉదయం 8 గంటలకు బస్సు నడపాలని సురేఖతో పాటు మరో ఐదుగురు టీచర్లు కూడా విజ్ఞప్తి చేశారు. ఖేడ్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి, ఖేడ్ నుంచి వట్‌పల్లికి, రాయిపల్లి మీదుగా లింగంపల్లికి బస్సులు నడపాలని రాయిపల్లికి చెందిన పలువురు కోరారు. ఆయా సమస్యలను నమోదు చేసుకున్న డీఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

వైభవంగా ఆత్మలింగ శివాలయ ప్రాణ ప్రతిష్ఠ

- హాజరైన మాధవానంద సరస్వతీస్వామి



పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధి గొట్టిముక్కుల గ్రామంలో నిర్మించిన శివాలయ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి వేదపండితులు గణపతి పూజ, గోపూజ, యాగ ప్రవేశం, రిత్విక్ వర్ణం, రక్షాబంధనం, ద్వారకాపూజ, నవగ్రహ పూజ, హోమంతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ గ్రేస్‌బాయ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామస్థులు హాజరై పూజలు నిర్వహించారు.

మాతా శిశు సంక్షేమ ఆస్పత్రికి అదనపు పడకలు

జహీరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న మాతా శిశు సంక్షేమ ఆస్పత్రికి 40 పడకల సిజేరియన్ సర్జికల్ వార్డును మంజూరు చేసినందుకుగాను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని మాతా శిశుసంక్షేమ ఆస్పత్రి నిర్మితమవుతున్నా.. సిజేరియన్ వార్డులో పడకలు లేకపోవడంతో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి 40 పడకల సిజేరియన్ సర్జికల్ వార్డును మంజూరు చేశారన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం



చిన్నశంకరంపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న హైమావతి

మెదక్/చేగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను రక్షించి.. చదివిద్దామని జిల్లా సంక్షేమ, మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి హైమావతి అన్నారు. 'బేటి బచావో బేటి బడావో' దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట హైస్కూల్‌లో మిషన్ శక్తి మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక టీ జిల్లా కో ఆర్డినేటర్ సంతోషి, జెండర్ స్పెషలిస్ట్ నాగమణి, కవిత, రమేష్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే చేగుంట మండలం మక్కరాజేపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని మెదక్ డీడబ్ల్యూవో హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో రిజిస్టర్, సరుకుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, సీనియర్ సహాయకులు శ్రీశైలం, ఏపీవో శ్వేత, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఉమారాణి పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో శుక్రవారం కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

మాతృభాష తల్లిలాంటిది

- ప్రముఖ కవి నాలేశ్వరం శంకరం

సంగారెడ్డి అర్బన్/హవేళిఘణపూర్/నిజాంపేట/పాపన్నపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాతృభాష తల్లిలాంటిదని ప్రముఖ కవి నాలేశ్వరం శంకరం పేర్కొన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, ఆంగ్ల విభాగాధిపతి డా.సుచిత్రసింగ్, తెలుగు విభాగాధిపతి డా.సుమతీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, తెలుగు ఉపాధ్యాయులు అశోక్, రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు చంద్రకాంత్, ఉపాధ్యాయులు అర్జున్, ఈశ్వరయ్య, సుకన్య, నరేష్, కుమారస్వామి, షాదుల్ పాల్గొన్నారు. పాపన్నపేట మండలంలోని ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈవో రాధాకిషన్ హాజరై మాట్లాడారు. ఇందులో ఏఎంవో సుదర్శనమూర్తి, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ కవి నాలేశ్వరం

ఆరోగ్యమే మహాభాగ్యం: ఐకేపీ డీపీఎం

చేగుంట/ఝరాసంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల సభ్యులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పేదరిక నిర్మూలన లక్ష్యం సాధ్యమవుతుందని ఐకేపీ డీపీఎం మోహన్ అన్నారు. చేగుంట ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు మానవ అభివృద్ధి ఆరోగ్యం, పోషణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనరసమ్మ సీసీలు రామస్వామి, శ్వేత, స్వామి, వివిధ గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్ అన్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఐకేపీ కార్యాలయంలో ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

న్యూస్ బాక్స్

ఆహ్వాన పత్రిక అందజేత

నారాయణఖేడ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణ శివారులో నిర్మించిన మార్కండేయ ఆలయ ప్రారంభోత్సవ ఉత్సవాలను మార్చి 3 నుంచి 6 వరకు నిర్వహించనున్నట్లు స్థానిక పద్మశాలీ సంఘం బాధ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి సంఘం బాధ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు.

జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా పుష్ప



రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆమె మాట్లాడుతూ 2019లో మొదటిసారి సభ్యురాలుగా ఎన్నికయ్యాయని చెప్పారు. రెండోసారి నియమించినందుకు మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విధుల్లో చేరిన ప్రత్యేకాధికారి

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పట్టణానికి ప్రత్యేకంగా నియమించిన జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పూలబొకె ఇచ్చి సత్కరించారు. మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి కలిసి సమస్యలు వివరించారు.

నేడు పోచమ్మ జాతర

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ పోచమ్మ ఆలయంలో శనివారం జాతర నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

కల్హేర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కల్హేర్ మండల పరిధిలోని బాచేపల్లి, మండల కేంద్రమైన నిజాంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల్లో పదో తరగతి ఇంటర్నల్ మార్కులను ఇతర పాఠశాలలకు చెందిన ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు శుక్రవారం పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 20 మార్కులను ఇంటర్నల్‌గా కలుపనుండటంతో ఈ మార్కులు వేసే పద్ధతిని పరిశీలించారు.

విద్యార్థులు సామర్థ్యాలు కలిగి ఉండాలి: ఎంఈవో

మెదక్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠ్యాంశాలపై కనీస సామర్థ్యాలు కలిగి ఉండాలని ఎంఈవో పుష్పవేణి అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లి పాఠశాలను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఫిర్యాదుల విభాగం ఏర్పాటు

నారాయణఖేడ్: రైతుభరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మూడు ఎకరాల్లోపు భూములకు డబ్బులు జమకాని రైతులు ఫిర్యాదు చేసేందుకు ఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఏడీఏ నూతన్‌కుమార్ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

రైతు సేవలో సహకార బ్యాంకు

జహీరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సేవలో సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని ఆ బ్యాంకు అధికారి దిలీప్ పేర్కొన్నారు. మొగుడంపల్లిలో రైతులతో సమావేశం నిర్వహించారు. తక్కువ వడ్డీరుణాలు, పొదుపు పథకాలు, డిజిటల్ లావాదేవీల అంశాలపై అవగాహన కల్పించారు.

క్రైం కార్నర్

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- ముగ్గురు కార్మికులకు గాయాలు

జిన్నారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రసాయన పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. కాజీపల్లి పరిధిలోని హెటిరో డ్రగ్స్ పరిశ్రమలో గురువారం రాత్రి రియాక్టర్ వద్ద ఫ్లాష్ ఫైర్ జరిగి స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డి, శైలేంద్రప్రసాద్, శేషుకుమార్ గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

మిషన్ భగీరథ పైపులు దగ్ధం

మునిపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో మిషన్ భగీరథ పంపుహౌస్ సమీపంలో ప్రమాదవశాత్తు గడ్డికి మంటలు చెలరేగి అక్కడే నిల్వ చేసిన మిషన్ భగీరథ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్టోర్ సూపర్‌వైజర్ సురేష్ ఫైరింజన్‌కు సమాచారమందించారు. అయితే ఫైరింజన్ వచ్చేసరికి పైపులు కాలిబూడిదయ్యాయి. దీంతో రూ.6 లక్షల విలువచేసే పైపులు దగ్ధమవడంతో నష్టం వాటిల్లింది.



ప్రమాదకరంగా..

సంగారెడ్డి- తూప్రాన్ రోడ్డుపై నర్సాపూర్ సమీపంలో ఓ లారీ పొట్టు నింపుకుని ప్రమాదకరంగా వెళ్తుంది. పొరపాటున ఓవర్‌టేక్ చేయాలని చూసినా.. ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే. చిన్న చిన్న వాటికే జరిమానాలు వేసే పోలీసులు, ఆర్టీఏ అధికారులకే ఇది కనిపించడం లేదా.. అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- నర్సాపూర్

ఉచిత మెగా హెల్త్ క్యాంపునకు విశేష స్పందన

- 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు



హెల్త్ క్యాంపునకు హాజరైన ప్రజలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సాహితీ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. న్యూరాలజిస్ట్ డా.పవన్‌కుమార్, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డా.అబ్దుల్‌రావూఫ్, జనరల్ ఫిజిషియన్ డా.శ్రీనివాస్ వైద్య సేవలందించారు. సుమారు 300 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ సాహితీరాము మాట్లాడుతూ ప్రతి శుక్రవారం న్యూరో సంబంధిత ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, జిల్లా ప్రజలందరూ ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సెయింట్ ఆంథోనీస్‌లో రజతోత్సవ వేడుకలు



సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విద్యాసంస్థల అధినేత సల్‌మోన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ 25 వసంతాల రజతోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ-అభ్యాస్ సీఈవో, ఫౌండర్ డా.భువనగిరి ఫణి పవన్‌శాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఎదుగడానికి తగిన సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత ఈదర పాపులమ్మ సల్‌మోన్‌రెడ్డి, లీడ్ అకాడమిక్ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, మునిచౌదరి, వరలక్ష్మి, అరుణారెడ్డి, జయబాలరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- మెదక్ జిల్లా పౌర సరఫరాల అధికారి సురేష్‌రెడ్డి

మనోహరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మెదక్ జిల్లా పౌర సరఫరాల అధికారి సురేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఎండబెట్టి, శుభ్రత పరిచి విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి స్రవంతి, ఏఈవోలు పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బాలికలు చదువుతున్న సమయంలో చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం జ్యోతిబాపూలే బాలికల వసతిగృహంలో చట్టాలపై అవగాహన కలిగించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణియాదవ్, సీఐ వినాయకరెడ్డి, ప్రిన్సిపాల్ నవనీత పాల్గొన్నారు.

కల్హేర్‌కు 108 అంబులెన్స్

కల్హేర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కల్హేర్‌కు నూతన 108 అంబులెన్స్‌ను కేటాయించారు. ఈ మేరకు 108 సిబ్బంది శుక్రవారం పూజలు నిర్వహించి వాహన సేవలు ప్రారంభించారు. కొంతకాలంగా ఇక్కడ సేవలందించిన 108 అంబులెన్స్ పాతది కావడంతో తరచూ మరమ్మతులకు గురికావడంతో అత్యవసర సమయంలో రోగులను, క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చుటలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పీ.సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు కల్హేర్‌కు అంబులెన్స్ వాహనం కేటాయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సోషల్ ఆడిట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి'

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై తనిఖీ బృందం సోషల్ ఆడిట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో సోషల్ ఆడిట్ సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేటినుంచి గ్రామాల్లో తనిఖీ బృందాలు వెళ్లి ఉపాధిహామీలో చేసిన పనులను చూపనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు రాజ్‌కుమార్, వెంకటాయిగౌడ్, ఆడిట్ ఎస్‌ఆర్‌పీ రవి, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు పాల్గొన్నారు.

చౌటకూర్ ఎంపీడీవోగా శంకర్

పుల్‌కల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ ఎంపీడీవోగా కే.శంకర్ నియమితులయ్యారు. పుల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న శంకర్‌ను చౌటకూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శంకర్‌ను ఎంపీవో శ్రీకాంత్, జూనియర్ సహాయకులు ప్రీతం, పంచాయతీ కార్యదర్శులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సెల్‌టవర్ పనులు నిలిపేయాలని ఆందోళన

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సెల్‌టవర్ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం నర్సిఖేడ్‌లో స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెల్‌టవర్ రేడియేషన్‌తో కాలనీ ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఈ విషయంలో కొన్నాళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. టవర్ నిర్వాహకులు పోలీసులను ఏర్పాటు చేసి నిర్మాణ పనులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా.. ప్రజామోదానికి వ్యతిరేకంగా వ్యవహరించరాదన్నారు. పనులు నిలిపివేయాలని ఎంపీ ఆదేశించినట్లు స్థానికులు తెలిపారు.